సాక్షి
గుంటూరు
శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



వరసిద్ధి వినాయకుడికి హోమాలు

వినుకొండ : కొండమెట్ల వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవగ్రహ, లక్ష్మీ, గణపతి హోమాల్లో దంపతులు పాల్గొన్నారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 31,550 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 17 క్యూసెక్కులు వదులుతున్నారు.

గణపతి హోమం



నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : కంచి కామకోటి పీఠం మారుతి దేవాలయ ప్రాంగణంలో గురువారం ఉదయం గణపతి స్వామికి అభిషేకం, హోమం నిర్వహించారు.

న్యూస్‌రీల్

చంద్ర గ్రహణం సందర్భంగా ఆలయాల మూసివేత



మంగళగిరి: సంపూర్ణ చంద్ర గ్రహణం సందర్భంగా ఆదివారం పలు ఆలయాలను మూసివేయనున్నారు. మంగళాద్రిలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఎగువ దిగువ సన్నిధులు, ఘాట్ రోడ్డులోని శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు అన్ని ఉపాలయాలను మధ్యాహ్నం ఒంటి గంట వరకు మూసివేయనున్నట్లు ఆలయ ఈవో సునీల్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం గ్రహణ శుద్ధి అనంతరం ఉదయం 8 గంటల నుంచి దర్శనానికి భక్తులను అనుమతిస్తామని ఆయన పేర్కొన్నారు.

పెదకాకాని శివాలయంలో...




పెదకాకాని: చంద్రగ్రహణం పురస్కరించుకుని శ్రీ భ్రమరాంబమల్లేశ్వరస్వామి దేవస్థానాన్ని ఆదివారం మధ్యాహ్నం స్వామి వారి మహానివేదన అనంతరం ఆలయ కవాట బంధనం(తలుపులు మూయుట) జరుగుతుందని డీసీ గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం రాహు కేతు పూజలు కూడా నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు.సోమవారం ఆలయ సంప్రోక్షణ అనంతరం ఉదయం 7:30 గంటల నుంచి భక్తులను అనుమతిస్తామని ఆయన తెలిపారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచకపోతే సమ్మె



మంగళగిరి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచకపోతే సమ్మెలోకి వెళ్తామని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె. సుబ్బాయమ్మ తెలిపారు. పట్టణంలోని టిప్పర్ల బజార్‌లో గల సీఐటీయూ కార్యాలయంలో గురువారం రాత్రి మంగళగిరి ప్రాజెక్ట్ మహాసభను కె. హేమలత అధ్యక్షతన నిర్వహించారు. సుబ్బాయమ్మ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంగన్‌వాడీలకు అండగా ఉంటామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వ నాయకులు, అధికారంలోకి వచ్చిన అనంతరం పట్టించుకోవడం లేదని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఏ.వి.ఎన్.కుమారి, యు. రుక్మిణి, సుజాత పాల్గొన్నారు.

గోతాల్లో జగనన్న కాలనీ ఇళ్ల పట్టాలు



నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : పేదలందరికీ ఇళ్లు ఉండాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి నిలువ నీడ కల్పించారు. స్థలాలు కేటాయించడంతో పాటు ఇళ్లు నిర్మించే కార్యక్రమం కూడా చేపట్టారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 75 వేల మందికి స్థలాలు కేటాయించారు. ఇందులో కొంత మందికి ఇళ్ల పట్టాలు కూడా పంపిణీ చేశారు.అయితే, వాటిని పూర్తి స్థాయిలో అధికారులు పంపిణీ చేయకపోవడంతో సచివాలయాల్లోనే మూలుగుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇళ్ల పట్టాల పంపిణీ నిలిచిపోయింది. నగర పరిధిలోని 127వ వార్డు సచివాలయంలో బుధవారం పాత సీఎం జగన్మోహన్‌రెడ్డి పేరుతో సదరం సర్టిఫికెట్ జారీ చేయడంపై కమిషనర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి, సచివాలయ సెక్రటరీలను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటనతో సచివాలయాల్లో ఉన్న పాత సర్టిఫికెట్స్, డాక్యుమెంట్స్‌ను నగరపాలక సంస్థకు అందజేయాలని ఆదేశించడంతో గోతాల్లో వేల సంఖ్యలో రిజిస్టర్ ఇళ్ల పట్టాల డాక్యుమెంట్స్ దర్శనమిచ్చాయి. వీటిని ప్రభుత్వం రద్దు చేసే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.



ఇళ్లకు తాళాలు



ఒరిగిన బొడ్డు రాయిని సరి చేస్తున్న గ్రామస్తులు



గ్రామస్తులు తాగే నీటి గుంతను పరిశీలిస్తున్న గోపిరెడ్డి



గ్రామ వీధుల్లో చల్లిన బ్లీచింగ్

అంతుచిక్కని వ్యాధి.. బతుకులు సమాధి

- భయం గుప్పెట్లో తురకపాలెం
- బయటకు రావాలంటే భయపడుతున్న గ్రామస్తులు
- ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన
- చుట్టాలు కూడా రావడం లేదని ఆవేదన
- ఇతర గ్రామాల్లో పనులకు వెళ్లాలన్నా రానివ్వడం లేదు
- వైద్య శిబిరానికి రావాలన్నా భయపడుతున్న ప్రజలు
- హడావుడిగా కదిలిన యంత్రాంగం



గ్రామంలో పర్యటిస్తున్న గుంటూరు జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, పల్నాడు జిల్లా అధ్యక్షులు గోపిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, గజ్జల సుధీర్ భార్గవరెడ్డి తదితరులు

గుంటూరు రూరల్: తురకపాలెం గ్రామస్తులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బతుకుతున్నారు. ప్రతి వీధిలో నలుగురైదుగురు మృత్యువాతకు గురవ్వడంతో చిన్నపాటి అనారోగ్యం కలిగినా భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి రక్త నమూనాలు సేకరిస్తున్నారే గానీ కారణాలు చెప్పడం లేదని ఆందోళన చెందుతున్నారు. తమను పక్క గ్రామాల వారు పనులకు పిలవడం లేదని, జీవనం ప్రశ్నార్థకంగా మారిందని వాపోతున్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సలు

గ్రామంలో అధికారులు మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేసినప్పటికీ ప్రజలు రావాలంటే భయపడుతున్నారు. పరీక్షలు చేసిన తరువాత ఏ రోగం బయటపడుతుందో.. ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నాం కదా! అని కొందరు మిన్నకుండిపోతున్నారు. మరికొందరైతే ప్రభుత్వ వైద్యులను నమ్మలేక ప్రైవేటు ఆసుపత్రులకు వెళుతున్నారు. చిన్నపాటి అనారోగ్యానికి పెద్ద మొత్తంలో ఖర్చుచేసి చికిత్సలు తీసుకుంటున్నారు. ఇదే అదనుగా చేసుకుని ప్రైవేటు వైద్యులు అందిన కాడికి బిల్లులు కట్టించుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. తురకపాలెం అని పేషెంట్ చెబితే చాలు రూ. లక్షల్లో వసూలు చేస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు.

హడావుడిగా పర్యటనలు

గ్రామంలో మీడియా తిరుగుతుందని తెలిసి అధికారులు హడావుడిగా పర్యటనలు చేశారు. మండల స్థాయి అధికారుల నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల వరకూ గడిచిన నాలుగు నెలలుగా ఇంత జరుగుతున్నా పట్టించుకోలేదని, ఇప్పుడు హడావుడి పర్యటనలు చేస్తున్నారంటూ గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది హడావుడిగా గ్రామంలోని మురుగు కాల్వలు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లుతున్నారు.

వదంతులతో వణుకు



ఇంటికి అడ్డంగా తెరలు

ఇంటి నుంచి బయటకు రావాలంటే భయంతో వణికి పోతున్నారు. అదేదో వైరస్.. బ్యాక్టీరియా అంట.. నీటి ద్వారా, మట్టి ద్వారా వస్తుందంట.. అది రావడంతోనే ఇన్‌ఫెక్షన్‌లకు గురై మృత్యువాతకు గురవుతున్నారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. రాత్రి 8 గంటల తరువాత ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయం కలుగుతుందని వాపోతున్నారు.

రచ్చబండ పేరుతో ఎమ్మెల్యే హడావుడి

గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే రచ్చబండ పేరుతో ప్రధాన వీధి చెట్టుకింద కూర్చుని ప్రజలతో ముచ్చటించారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని పలువురు అడిగారు. ప్రతి ఇంటికీ రూ. వెయ్యి చొప్పున కలెక్ట్ చేయించండని, దానికి తోడు మరికొంత తాను ఇస్తానని, దాన్ని బాధిత కుటుంబాలకు ఇద్దామని ఎమ్మెల్యే అన్నాడని ప్రజలు వాపోతున్నారు. ఒక పక్క అనారోగాలతో మృత్యువాతకు గురవుతున్న ప్రజలు ఇంటికి వెయ్యి రూపాయలు ఎలా ఇస్తారని మహిళలు, ప్రజలు చర్చించుకుటున్నారు. ప్రజలను ఆదుకోవాల్సిన ప్రజాప్రతినిధి ఈ విధంగా మాట్లాడటంపై కొందరు పెదవి విరుస్తున్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి: ఎమ్మెల్యే బూర్ల

గుంటూరు రూరల్: తురకపాలెంలో స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు గురువారం పర్యటించారు. గత నాలుగు నెలలుగా గ్రామంలో ప్రజలు అకాల అనారోగ్య మృత్యువాతలకు గురవ్వడంతో గురువారం గ్రామంలో పారిశుద్ధ్యం, ప్రజారోగ్యశాఖ, తాగునీటి శాఖ అధికారులతో మాట్లాడారు. గ్రామంలో పరిస్థితులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది సరిపోకపోతే ఇతర గ్రామాలనుంచి తెచ్చుకుని పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో మాట్లాడి ప్రజల ఆరోగ్య పరిస్థితులను వాకబు చేశారు. స్థానికంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులను నిలదీస్తున్న గ్రామస్తులు

ఇంటింటికీ రక్త నమూనాల సేకరణ

జరగాల్సిన నష్టం జరిగిన తర్వాత తీరిగ్గా ప్రజారోగ్యశాఖ అధికారులు ఇంటింటికీ వెళ్లి గ్రామస్తుల నుంచి రక్తం, ఇతర నమూనాలను సేకరిస్తున్నారు. తాగునీటి, మట్టి పరీక్షలు చేస్తున్నారు. ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా ? అని పారిశుద్ధ్యం కూడా అధికారులు పరిశీలిస్తున్నారు.

సరిహద్దురాయి సరిచేసిన పెద్దలు

నాలుగు నెలల కిందట గ్రామంలో ఏర్పాటు చేసిన పొలిమేర రాయి ఒక పక్కకు ఒరగడంతో అనర్థాలు జరుగుతున్నాయని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం గ్రామంలోని పెద్దలు శాస్త్రోక్తంగా గ్రామ శివారులో ఏర్పాటు చేసిన సరిహద్దు రాయిని సరిచేశారు. ఇప్పటికైనా అకాల మరణాలు ఆగుతాయని గ్రామస్తులు భావిస్తున్నారు.

మరణాల వెనక కారణాల నమోదుకు చర్యలు

- వైద్యారోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్
- తురకపాలెంలో పర్యటన




వైద్యులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ వీరపాండియన్, కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు రూరల్: గుంటూరు జిల్లా తురకపాలెంలో మరణాలకు దారితీసిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి కారణాల నమోదుకు చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. గురువారం తురకపాలెం గ్రామంలో గత రెండు నెలలలో 30 మరణాలకు దారితీసిన కారణాలను పరిశీలించడానికి ఆయన గురువారం జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మితో కలసి గ్రామంలో పర్యటించారు. మెడికల్ క్యాంప్‌ను పరిశీలించి అక్కడ బాధితులకు అందిస్తున్న వైద్య సేవలను, పరీక్షల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీరపాండియన్ మాట్లాడుతూ వైద్య నిపుణుల బృందాన్ని రెండు రోజుల క్రితం ఏర్పాటు చేశామని, ప్రాథమిక నివేదిక కూడా ఇచ్చినట్లు తెలిపారు. నివేదిక ప్రకారం నిర్ణయానికి రావడం సాధ్యపడదని, మెల్లైడియోసిస్ అని, ఆల్కహాల్ అని చెబుతున్నారని , రక్త నమూనాల పరీక్షల నివేదిక అనంతరం కారణాలను విశ్లేషిస్తామని తెలిపారు. రెండు మూడు రోజులలో కారణాలు తెలుసుకుంటామని, చనిపోయిన వారి మెడికల్ బిల్లులు తీసుకుని సీయంఆర్‌ఎఫ్ ద్వారా చెల్లిస్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి మాట్లాడుతూ తురకపాలెంలో గత రెండు నెలలుగా మరణాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఇప్పటి వరకు 14 టీంలను జనరల్ మెడిసిన్, బయోకెమిస్ట్రీ, పాథాలజీ, మైక్రో బయోలాజీ తదితర ఆరు విభాగాల నుంచి బృందాలను నియమించామని, మరణాలకు గల కారణాలు తెలియాలంటే మూడు రోజులు సమయం పడుతుందని తెలిపారు. గ్రామంలోని మహిళలు కొన్ని సమస్యలను తన దృష్టికి తెచ్చారని, వారు కోరిన విధంగానే బోరు వాటర్ బయటకు పంపకుండా గ్రామంలోనే వినియోగించేలా చూడాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.శ్రీనివాసరావు , జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, డీయంఅండ్ హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రావణ్ బాబు, డీపీఓ నాగసాయికుమార్, గుంటూరు పశ్చిమ మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, గ్రౌండ్ వాటర్, మెడికల్, పంచాయతీ శాఖ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు సర్వం సిద్ధం

7న ఫారెస్ట్ అధికారుల ఉద్యోగాలకు స్క్రీనింగ్ టెస్ట్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో షేక్ ఖాజావలి

గుంటూరు వెస్ట్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఫారెస్ట్ అధికారుల ఉద్యోగాలకు స్క్రీనింగ్ టెస్ట్ ఆదివారం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి షేక్‌ఖాజావలి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్స్‌కు పరీక్ష ఉంటుందని, దీనికి 7,655 మంది హాజరవుతారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5:30 వరకు జరగనున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఉద్యోగాలకు 1,492 మంది హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని 10 కేంద్రాలను పరీక్షల నిర్వహణకు కేటాయించామని, వీటికి సీనియర్ డెప్యూటీ తహసీల్దార్లు లైజనింగ్ అధికారులుగా వ్యవహరిస్తారని వివరించారు. పరీక్ష కేంద్రాలు, ఇతర సమాచారం పొందేందుకు అభ్యర్థులు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నంబర్ 0863-2234014ను సంప్రదించాలని సూచించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందు హాజరుకావచ్చన్నారు. హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం గుర్తింపు పొందిన ఏదైనా గుర్తింపు కార్డు చూపాలని ఆయన తెలిపారు. మొబైల్స్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌ను అనుమతించమని చెప్పారు. సమావేశంలో వెస్ట్ జోన్ డీఎస్పీ అరవింద్, కలెక్టరేట్ ఏఓ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

శ్రీ గురుభ్యో నమః



- నేడు జిల్లాస్థాయి గురుపూజోత్సవం • 54 మంది ఉత్తమ ఉపాధ్యాయులతో జాబితా విడుదల

గుంటూరు ఎడ్యుకేషన్: మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు 54 మంది ఎంపికయ్యారు. తొమ్మిది మంది గ్రేడ్-2 హెచ్‌ఎంలతో పాటు వివిధ కేటగిరీల వారీగా స్కూల్ అసిస్టెంట్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, ఎస్జీటీలను ఎంపిక చేశారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆమోదంతో జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక జాబితా విడుదల చేశారు. జిల్లా కలెక్టరేట్ వద్ద ఉన్న రెవెన్యూ కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.

- గ్రేడ్-2 హెచ్‌ఎంల విభాగంలో సీహెచ్. మంజులాదేవి, శ్రామికనగర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల (మంగళగిరి మండలం), బి. రాజీవ్‌రత్న, జెడ్పీ హైస్కూల్ (నూతక్కి), కె.లాజర్‌బాబు, మున్సిపల్ హైస్కూల్ (నేతాజీనగర్), వై.శేషతల్ప సాయి, జెడ్పీ హైస్కూల్ (చింతలపూడి), ఏ.తిరుమలేష్, జెడ్పీ హైస్కూల్ (తురకపాలెం), ఎం.నాగేశ్వరరావు, జెడ్పీ హైస్కూల్ (కొలకలూరు), ఎస్.శ్రీనివాసరావు, మున్సిపల్ హైస్కూల్, బీఆర్ నగర్ (మంగళగిరి), ఈపూరి అరుణ (జెడ్పీ హైస్కూల్ చిర్రావూరు), పొట్లూరి విజయలక్ష్మి (జెడ్పీ హైస్కూల్ శేకూరు),
- ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం విభాగంలో ఎంపీపీ స్కూల్ కె.శ్రీనివాసరావు (బీసీ), పేరేచర్ల), బి.జగన్నాథనాయక్ (ఏవీఆర్ రజకపేట (తెనాలి), కొత్తపల్లి నాగజ్యోతి, ఫిజికల్ సైన్స్ అధ్యాపకురాలు (డైట్, బోయపాలెం)
- స్కూల్ అసిస్టెంట్ విభాగంలో జిల్లెళ్లపల్లి వెంకయ్య, జెడ్పీ హైస్కూల్ (పెదకాకాని), అహ్మదున్నీసా, ఎంపీయూపీ స్కూల్ (నులకపేట), తోట రామలీల, జెడ్పీ హైస్కూల్ (కొర్నెపాడు), కొనికి శ్రీనివాసరావు, జెడ్పీ హైస్కూల్ (మామిళ్లపల్లి), అవనిగడ్డ వెంకటరెడ్డి, జెడ్పీ హైస్కూల్ (గొట్టిపాడు), గుడిపూడి సత్యనారాయణ, జెడ్పీ హైస్కూల్ (మందడం), సీహెచ్. ప్రమీలాదేవి, జెడ్పీ హైస్కూల్ (కొండపాటూరు), శంకరమంచి వరలక్ష్మి, కేవీఆర్ జెడ్పీ హైస్కూల్ (తుళ్లూరు), సీహెచ్. శంకరరెడ్డి, కేసీహెచ్ఎస్ (కొత్తరెడ్డిపాలెం), కె.జయరావు, జెడ్పీ హైస్కూల్ (కొర్రపాడు), ఎస్.వెంకటరెడ్డి, జెడ్పీ హైస్కూల్ (వెనిగండ్ల), షేక్ సలీమ్, జెడ్పీ హైస్కూల్ (జీజీపాలెం), కన్నెగంటి శ్రీనివాసరావు, జెడ్పీ హైస్కూల్ (ఏటుకూరు), తోకల ఆంజనేయులు, జెడ్పీ హైస్కూల్ (ఉండవల్లి), ఆర్. విజయకుమారి, జెడ్పీ హైస్కూల్ (దొప్పలపాడు), యు.ఉమాదేవి, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల (చౌత్రా, గుంటూరు), ఏ.నాగమణి, ఎస్ఎస్ఎస్ఎం హైస్కూల్ (తెనాలి).

-ఎస్జీటీ విభాగంలో షేక్ అబ్దుల్ హనీఫ్, ఎంపీపీ స్కూల్ (మేడికొండూరు), మండా శ్రీదేవి, ఎంపీపీ స్కూల్, స్వర్ణాంధ్రనగర్ (గుంటూరు), ఎస్.కోటేశ్వరరావు, ఎంపీపీ స్కూల్ (దుగ్గిరాల), ఎండీ కరీముల్లా, ఎంపీపీ స్కూల్ (ఈమని), ఎం.మోహనకృష్ణ, ఎంపీపీ స్కూల్ (మోరంపూడి), పాలెం సాంబశివరావు, ఎంపీపీ స్కూల్ (వడ్డేశ్వరం), ఏ. హరివరప్రసాద్, ఎంపీపీ స్కూల్, జీఎంపీ (కొలకలూరు), పి.శ్రీధర్, ఎంపీయూపీఎస్ (లేమల్లెపాడు), డి.ఉమాదేవి, మోడల్ ప్రైమరీ స్కూల్ (వల్లభాపురం), దాసరి అలివేలు కుమారి (ఎంపీపీ స్కూల్, కొల్లిపర), పి.శ్రీనివాసమూర్తి, ఎంపీపీ స్కూల్ (వేజెండ్ల), ఎంవీఎస్ లక్ష్మీకుమారి, ఎంపీపీ స్కూల్ (వేజెండ్ల), ఎం.జ్యోతి, ఎంపీపీ స్కూల్ (కాకుమాను), బి.కృష్ణకిశోర్, ఎంపీపీ స్కూల్ (దాసరిపాలెం), వి.వినోద్, ఎంపీపీ స్కూల్ (సరిపూడి), ఎస్.కోటేశ్వరరావు, ఎంపీపీ స్కూల్ (రాయపూడి), సీహెచ్ ఆదినారాయణ, ఎంపీపీ స్కూల్ (నెక్కల్లు), కె.సైదా నాయక్, మున్సిపల్ ప్రైమరీ స్కూల్ (మంగళగిరి), జి.సుందరరాజు, ఎంపీపీ స్కూల్ (చినకాకాని), కె.సువర్ణకుమారి, మోడల్ ప్రైమరీ స్కూల్ (పొన్నెకల్లు), ఏ. నిర్మల, ఎంపీపీ స్కూల్ (పమిడివారిపాలెం), జి.సుధారాణి, ఎంపీపీ స్కూల్ (వరగాని), పి.స్వాతి, ఎంఈఎస్ చెంచుపేట (తెనాలి), పి.రజియాబేగం, నగరపాలకసంస్థ ప్రాథమిక పాఠశాల (చిన్నబజారు, గుంటూరు), బి.సమత, ఎంపీపీ స్కూల్ (పుల్లడిగుంట).

ఏఎన్‌యూలో ఐదుగురు ఎంపిక

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఐదుగురు అధ్యాపకులకు రాష్ట్ర ఉత్తమ టీచర్ అవార్డులు లభించాయి. ఆచార్య జి. చెన్నారెడ్డి (ఇంగ్లిష్), ఆచార్య పి.పి.ఎస్.పాల్ కుమార్ (వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్, ఆచార్య ఆర్ రమేష్‌రాజు (కెమిస్ట్రీ), ఆచార్య వి. దివ్యతేజోమూర్తి (రూరల్ డెవలప్‌మెంటు), డాక్టర్ పి. సుధాకర్ (బయోటెక్నాలజీ)లకు శుక్రవారం విజయవాడలో జరిగే టీచర్స్ డే వేడుకల్లో సీఎం నారా చంద్రబాబునాయుడు అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులకు ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె. గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ప్రిన్సిపాల్స్ ఆచార్య వీరయ్య, సురేషకుమార్, లింగరాజు, ప్రమీలారాణి ఓఎస్ అభినందనలు తెలియజేశారు.

బీచ్ ఫెస్టివల్‌కు సహకారం అందించండి

బాపట్ల: జిల్లాలో బీచ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించడానికి సహాయ, సహకారాలు అందించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి ఆక్వా పరిశ్రమల యాజమానులను కోరారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సూర్యలంకలో నిర్వహించే బీచ్ ఫెస్టివల్‌పై గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఆక్వా పరిశ్రమల యజమానులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సూర్యలంక బీచ్‌ను గోవా బీచ్ మాదిరి అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామని చెప్పారు. సూర్యలంకలో ఈనెల 26, 27, 28 తేదీల్లో బీచ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడుకల్లో భాగంగా 27వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వస్తారని తెలిపారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ బాపట్ల సూర్యలంక బీచ్‌ను అభివృద్ధికి ప్రభుత్వం రూ.97 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 18,00 గరిష్ఠం : రూ. 2,600

మోడల్ ధర రూ. 2,300

పసుపు ధరలు
(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 647

కొమ్ములు : 551 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
10,300	10,450	10,320

కాయలు : 241 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
10,300	10,450	10,350

మొత్తం అమ్మకాలు : 485.25 క్వింటాళ్లు

-దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం
(గురువారం ధరలు)

వచ్చిన బస్తాలు	75,968
అమ్మకాలు	70,144
నిల్వ	15,795

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–14,300
నంబరు–5	10,000–13,500
341	11,000–13,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–14,500
నంబరు–5	10,000–13,500
341	11,000–15,500
4884	10,000–13,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,400
బాడిగ 355	10,000 – 15,000
దేవనూరు డీలక్స్	10,000 – 13600
ఆర్మూర్	9,800 – 12,500
తాలుకాయలు	6,200 – 7,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,300
బాడిగ 355	10,000 – 14,800
దువనూర్ డీలక్స్	10,500 – 13,500
తాలు	5,500 – 7,500

-కొరిటెపాడు (గుంటూరు)

ఎక్స్‌లో లోకేష్ స్పందన... పోలీసుల అత్యుత్సాహం


- ఫై నుంచి ఆదేశాలు ఉన్నాయంటూ బాధితుడికి బెదిరింపులు
- కారు ఇచ్చి వెళ్లాలని వైఎస్సార్‌సీపీ నేతకు హుకుం జారీ చేసిన అధికారులు
- లేని పక్షంలో కేసులు బనాయించి రౌడీషీట్ తెరుస్తామని ఎస్సై హెచ్చరిక
- దిక్కుతోచక కారును పోలీసులకు అప్పగించిన వైఎస్సార్‌సీపీ నేత
- సాయం చేయడానికి వెళ్లినందుకు ఆర్థికంగా నష్టపోయిన వైనం



ప్రేమ్‌కుమార్ నుంచి కారును స్వాధీనం చేసుకుంటున్న నగరంపాలెం ఎస్సై రాంబాబు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): చేసిన సహాయాన్ని మరిచి అధికారం ఉందని జోజిబాబు అనే వ్యక్తి 'వైఎస్సార్‌సీపీ నాయకుడు నా కారు తీసుకుని ఇవ్వడం లేదని, నగరంపాలెం పోలీసులు పట్టించుకోవడం లేదని' ఎక్స్‌లో చేసిన పోస్టుకు మంత్రి లోకేష్ స్పందించారు. ఆయన స్పందనతో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించి కారును స్వాధీనం చేసుకున్న ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఈ మేరకు బాధితుడు తన గోడు వెళ్లబోసుకున్నారు. శ్రీనివాసరావుపేటకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు కొరిటిపాటి ప్రేమ్‌కుమార్ వద్దకు కారంపూడి ప్రాంతానికి చెందిన జోజి బాబు అనే వ్యక్తి గతంలో వచ్చారు. తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కారును సబ్సిడీపై జోజిబాబు తీసుకున్నారు. ఆ తరువాత మంగళగిరికి చెందిన పున్నా రామచంద్రరావుకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఇచ్చారు. మూడేళ్లయినా వాహనం అప్పగించకపోగా, డబ్బులు కూడా చెల్లించడం లేదంటూ 2022లో జోజి బాబు వాపోతూ ప్రేమ్‌కుమార్ సాయం కోరారు. ఎలాగైనా కారు ఇప్పించాలని ప్రాధేయపడ్డారు. దీంతో పున్నా రామచంద్రరావు వద్దకు ప్రేమ్‌కుమార్ వెళ్లి నిలదీశారు. రూ.8 లక్షలకు కారును జోజిబాబు తాకట్టు పెట్టారని, డబ్బు ఇచ్చి కారు తీసుకెళ్లాలని రామచంద్రరావు చెప్పారు. దీంతో ప్రేమ్‌కుమార్... ఆ సమయంలో నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐ హైమారావును కలిసి జోజిబాబు చేత ఫిర్యాదు చేయించారు. దీంతో సీఐ దర్యాప్తు చేపట్టారు. మంగళగిరికి చెందిన పున్నా రామచంద్రరావును స్టేషన్‌కు పిలిపించారు. కారు ఇవ్వాల్సిందిగా సూచించారు. కానీ తమకు ఇవ్వాల్సిన రూ.8 లక్షలు చెల్లించాలని రామచంద్రరావుకు మధ్యవర్తిగా వచ్చిన అద్దంకి ప్రాంతానికి చెందిన రాజ్‌కుమార్ పేర్కొనగా.... అంత ఇవ్వలేనని జోజి బాబు చెప్పారు. ప్రేమ్‌కుమార్‌ను బతిమిలాడి ఎలాగైనా కారు ఇప్పించాలని కోరారు. ప్రేమ్‌కుమార్ వద్ద ఉన్న స్కార్పియో కారును విక్రయించి, దాని ద్వారా వచ్చిన రూ.5 లక్షలు పున్నా రామచంద్రరావుకు చెల్లించారు. ఆ కారుకు సంబంధించి 2022 జూన్ 30వ తేదీన జోజిబాబు చేత రూ.50 స్టాంప్ పేపర్ మీద షరతులతో కూడిన అంగీకార పత్రాన్ని రాయించుకుని కారును ప్రేమ్‌కుమార్ తన అవసరాలకు వినియోగించుకుంటున్నారు. 2022 నుంచి జోజిబాబు అడిగినప్పుడల్లా ఎంతో కొంత నగదు ఇస్తూ స్నేహంగా ఉన్నారు. తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత సుమారు ఆరు నెలల కిత్రం జోజిబాబు కారంపూడి పోలీస్ స్టేషన్‌లో కారు తీసుకుని ప్రేమ్‌కుమార్ తిరిగి ఇవ్వడం లేదని చెప్పారు. పోలీసులు వెంటనే ప్రేమ్‌కుమార్‌ను పిలిపించారు. జరిగిన విషయాన్ని ఆయన పోలీసులకు తెలిపారు. మళ్లీ మూడు నెలల క్రితం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో జోజిబాబు ఫిర్యాదు చేయగా, ప్రేమ్‌కుమార్‌ను పిలిచి మాట్లాడారు. జోజిబాబు నుంచి రూ.5 లక్షలు ఇప్పించాలని, తాను ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నానని ప్రేమ్‌కుమార్ చెప్పారు.

మంత్రి నారా లోకేష్‌కు ఎక్స్‌లో చేసిన పోస్ట్ ఇదే...



జోజిబాబు అనే వ్యక్తి ఎక్స్‌లో గురువారం ఉదయం 10.45 గంటలకు 'అన్నా.. నారా లోకేష్ గారు. నా పేరు జోజిబాబు. నా జీవనాధారం అయిన ఇన్నోవా కారును వైఎస్సార్‌సీపీ చెందిన ఒక వ్యక్తి అన్యాయంగా లాక్కుని వెళ్లే ఏడాదిగా నాకు జరిగిన అన్యాయం గురించి గుంటూరులోని నగరంపాలెం పోలీసుల చుట్టూ తిరుగుతున్నా స్పందన లేదు. దయచేసి నా కారు నాకు ఇప్పించండి. నాకు అదే జీవనాధారం.' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తక్షణమే స్పందించిన లోకేష్ 'ప్లీజ్ లుక్ ఇన్‌టూ దిస్ ఇష్యూ ఏపీ పోలీస్ 100. కైండ్లీ ఫాలో అప్.. అండ్ కీప్ మీ అప్‌డేట్ అని పోస్ట్ చేశారు. ప్రేమ్‌కుమార్‌కు అప్పటి వరకు జోజిబాబు నగదు చెల్లించాలని చెప్పిన పోలీసులే... ఇప్పుడు మాట మార్చి స్టేషన్‌కు పిలిపించారు. కారు తక్షణమే అప్పగించాలని లేని పక్షంలో చీటింగ్, దొంగతనం కేసులు బనాయిస్తామని ప్రేమ్‌కుమార్‌ను బెదిరించారు. అవసరం అయితే రౌడీషీట్ కూడా తెరుస్తామని హెచ్చరించారు. గంటల వ్యవధిలో ప్రేమ్‌కుమార్ నుంచి కారు తీసుకున్నారు. తన వద్దకు వచ్చి ప్రాధేయపడి సహాయం పొందిన వ్యక్తి ఎలాగైనా ఆ కారు వెనక్కి తీసుకోవాలని మంత్రి లోకేష్‌కు ఎక్స్‌లో పోస్ట్ చేశారని.... మంత్రి లోకేష్ అప్‌డేట్ చేయమని చెబితే పోలీసులు అత్యుత్సాహంతో కారు తాళాలు తీసుకున్నారని బాధితుడు వాపోయారు. ది ఎంతవరకు సమంజసం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు రావాల్సిన రూ.5 లక్షలు వెనక్కి ఇప్పించాలని కోరారు.

ఉమేష్ చంద్రకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి, ఉమేష్ చంద్ర సతీమణి నాగరాణి

తెనాలి రూరల్: దివంగత ఐపీఎస్ అధికారి చదలవాడ ఉమేష్ చంద్ర 26వ వర్ధంతిని గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సబ్ డివిజన్ పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో చెంచుపేటలో జరిగిన కార్యక్రమంలో ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఆయన చూపిన అంకిత భావం ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తోందని తెలిపారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అసాంఘిక శక్తులపై ఉమేష్ చంద్ర ఉక్కుపాదం మోపారని గుర్తు చేశారు. నిజాయతీ కలిగిన అధికారిని కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమేష్ చంద్ర సతీమణి, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, డీఎస్పీ బి. జనార్ధనరావు, సీఐలు వి. మల్లికార్జునరావు, రాములనాయక్, ఎస్. రమేషబాబు, ఆర్. ఉమేష్, సబ్ డివిజన్‌లోని ఎస్‌ఐలు సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఉమేష్ చంద్ర కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాల్గొన్నారు. ముందుగా ఉమేష్‌చంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

జీజీహెచ్ ఏడీగా పూసల శ్రీనివాసరావు



శ్రీనివాసరావును అభినందిస్తున్న ఏజీ ఎన్జీవో సంఘ నేతలు, జీజీహెచ్ ఉద్యోగ సంఘాల నేతలు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా (ఏడీ) పూసల శ్రీనివాసరావు గురువారం విధుల్లో చేరారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో నేషనల్ హెల్త్ మిషన్ ఏడీగా పనిచేస్తున్న ఆయన్ను గుంటూరు జీజీహెచ్ ఏడీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణను కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. గుంటూరు జీజీహెచ్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా, పరిపాలనా అధికారిగా, ఇన్‌చార్జి ఏడీగా శ్రీనివాసరావు పని చేశారు. 2024లో ఏడీగా పదోన్నతి పొంది, కమిషనర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం జీజీహెచ్ ఏడీగా పనిచేస్తున్న చింతలపూడి నాగేశ్వరరావు ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేశారు. నూతనంగా విధుల్లో చేరిన ఏడీని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా సెక్రటరీ శ్యామ్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, జీజీహెచ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నేతలు, పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది బొకేలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీజీహెచ్‌లో పెండింగ్‌లో ఉన్న రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులను మూడు నెలల్లో ఇస్తామని తెలిపారు. మందులు, సర్జికల్స్, ఇంప్లాంట్ల టెండర్ల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి, ఆసుపత్రిలో రోగులకు అన్నీ అందుబాటులో ఉండేలా చూస్తామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఆడిట్ పూర్తి చేయిస్తామని పేర్కొన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ, జాయింట్ డైరెక్టర్ సుధారాణి సహకారంతో పరిపాలన విభాగంలో మార్పులు తీసుకొచ్చి, మెరుగైన పాలన అందించేందుకు కృషి చేస్తామని శ్రీనివాసరావు తెలిపారు.

పంటలపై పరిశోధన, విస్తరణ దిశగా రోడ్ మ్యాప్

ఐఐఓఆర్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కె. మధుర్



వర్క్‌షాపులో పాల్గొన్న అధికారులు

గుంటూరు రూరల్: లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో గురువారం హైదరాబాద్‌కు చెందిన జాతీయ నూనె గింజల సంస్థ, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాష్ట్రంలో వ్యవసాయ ప్రాముఖ్య అంశాల గుర్తింపుపై రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ వ్యవసాయ జాతీయ పరిశోధన సంస్థల ప్రతినిధులు, రాష్ట్రస్థాయి పరిశోధన సంస్థలు, వ్యవసాయ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు. వర్క్‌షాప్ నోడల్ ఆఫీసర్ ఐఐఓఆర్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కె మధుర్ మాట్లాడుతూ రానున్న ఐదు సంవత్సరాలకు రాష్ట్రంలోని వివిధ పంటల్లో ముఖ్యమైన పరిశోధన, విస్తరణ, అంశాలను గుర్తించి వాటిని సాధించేందుకు అవసరమైన ప్రణాళికల కోసం రోడ్ మ్యాప్ రూపొందించాలని తెలిపారు. లక్ష్యాన్ని చేరుకునేందుకు వివిధ శాఖల సమన్వయం కావాలన్నారు. ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్. శారదజయలక్ష్మీదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం పద్ధతులను శాస్త్రీయంగా పరిశోధించి ఫలితాలను రైతులకు అందజేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఐఐఓఆర్ డైరెక్టర్ డాక్టర్ కె సురేష్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ మధుమతి, డాక్టర్ పీవీ సత్యనారాయణ, డాక్టర్ ఎ.లత పాల్గొన్నారు.

తురకపాలెంలో అన్నీ అసహజ మరణాలే

- ప్రభుత్వం ముందే మేల్కొనుంటే ఇంత నష్టం జరిగేది కాదు
- బాధిత కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- సీపీఎం నేత సీహెచ్ బాబురావు

గుంటూరు రూరల్: తురకపాలెంలో అంతుపట్టని మరణాలు సంభవిస్తున్నా కూటమి ప్రభుత్వం నిద్రావస్థలో ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు ధ్వజమెత్తారు. గురువారం తురకపాలెం గ్రామంలో పర్యటించి అకాల మృత్యువాతకు గురైన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముందే మేల్కొని ఉంటే కొంతమంది ప్రజల ప్రాణాలైనా కాపాడే అవకాశం ఉండేదన్నారు. 50 మందికి పైగా చనిపోయినా, ఒక్క కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందలేదన్నారు. కేంద్ర గ్రామీణ మంత్రి పెమ్మసాని నియోజకవర్గంలోనే ఈ దుస్థితి ఉంటే ఇక రాష్ట్రం పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. జిల్లా మంత్రి లోకేష్‌కు గ్రామం గురించి తెలుసుకునే సమయం లేదా అని ప్రశ్నించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ప్రకటనలకే పరిమితమయ్యారని ప్రజలను పట్టించుకోవటం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి వైద్య బృందాలను పంపాలి. కారణాల నిర్ధారించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు పాల్గొన్నారు.

12న జిల్లా జూనియర్ అథ్లెటిక్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 12న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఉదయం 9 గంటలకు జిల్లా స్థాయి అండర్– 14, 16, 18, 20 బాలురు, బాలికలు, యువతీ యువకులకు అథ్లెటిక్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వి.ఎస్.ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభకనబరచిన జట్టును త్వరలో ఏలూరులో జరగనున్న ఏపీ జూనియర్ అథ్లెటిక్ మీట్‌కు పంపిస్తామని పేర్కొన్నారు.

యద్దనపూడిలో పట్టపగలే చోరీ

యద్దనపూడి: మండల కేంద్రమైన యద్దనపూడి పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న ఓ ఇంట్లో గురువారం మధ్యాహ్నం చోరీ జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్కన గల ఓ ఇంట్లో 70 సంవత్సరాలు వయస్సు గల వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తోంది. గురువారం ఉదయం పొగాకు గ్రేడింగ్ పనులకు వెళ్లిన వృద్ధురాలు మధ్యాహ్నం భోజనం నిమిత్తం ఇంటికి రాగా ఇంటి తలుపులతో పాటు బీరువా తలుపులు సైతం తెరిచి ఉండటంతో గమనించి స్థానికులను అప్రమత్తం చేసింది. దీంతో బీరువాను పరిశీలించగా సుమారు 10 సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించింది. బీరువా కింది బాగంలో వేరే అరలో ఉంచిన రూ.3 లక్షలకు పైగా నగదు అలాగే ఉండటంతో ఊపిరి పీల్చుకుంది. ఈ విషయమై ఎస్సై రత్నకుమారిని వివరణ కోరగా చోరీ విషయం పరిశీలిస్తున్నామని.. ఇంత వరకు తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు. చోరీ జరిగిన తీరును బట్టి వృద్ధురాలు బంధువులు గానీ సమీపంలోని వ్యక్తులు కానీ పాల్పడి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు.

ఉద్యోగి కుటుంబానికి చేయూత

రూ. 1లక్ష అందజేసిన సమాచార శాఖ కమిషనర్



మంగళగిరి: ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ దాతృత్వాన్ని చాటుకున్నారు. సమాచార శాఖ కార్యాలయంలో సబార్డినేట్‌గా పని చేస్తున్న బి. ధనరాజ్ అనారోగ్యంతో మృతి చెందారు. అతడి మృతితో కుటుంబం ఆర్థికంగా కుంగిపోయి ఇబ్బందులు పడుతోందని తెలుసుకున్న కమిషనర్ చేయూత అందించారు. తన సొంత నిధుల నుంచి రూ. లక్ష చెక్కును గురువారం ధనరాజ్ కుటుంబ సభ్యులకు చినకాకానిలో కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు. ధనరాజ్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా ఓనమ్ వేడుకలు



తెనాలి అర్బన్: బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి ఇంగ్లిషు మీడియం స్కూలులో గురువారం ఓనమ్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులతో పాఠశాలకు వచ్చి, ఆటపాటలతో అందరినీ అలరించారు. దీప ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ జేమ్స్ మోర్లే మాట్లాడుతూ ఐక్యత, ఆనంద, స్నేహభావానికి ఓనమ్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

గురజాల: మెగా జాతీయ లోక్ అదాలత్ ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, నాలుగవ అదనపు జిల్లా జడ్జి ఆర్. శరత్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అదాలత్‌లో రాజీపడదగిన సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించనున్నట్లు తెలిపారు. చెక్ బౌన్స్, మోటారు వాహన ప్రమాదాలు, రెవెన్యూ వివాదాలు, బ్యాంకు సంబంధిత కేసులు వంటివి పరిష్కరించుకునే అవకాశం ఉన్నట్లు వివరించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. '

ఉరి వేసుకుని బలవన్మరణం

చీరాల అర్బన్: రామాపురంలోని ఓ రిసార్ట్‌లో పనిచేస్తున్న వ్యక్తి గురువారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈపూరుపాలెం ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. మంగళగిరికి చెందిన అవ్వారు నరేష్ (42) రామాపురంలోని ఓ రిసార్ట్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అయితే గురువారం గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఈపూరుపాలెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

డిప్లొమా ప్రవేశాలకు మాన్యువల్ స్పాట్ కౌన్సెలింగ్

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం, విత్తన సాంకేతికత పరిజ్ఞానం, వ్యవసాయ ఇంజనీరింగ్ డిప్లమో కోర్సుల ప్రవేశాలకు ఈనెల 8వ తేదీన మాన్యువల్ స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి. రామచంద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తేదీన ఉదయం 10 గంటలకు గుంటూరు నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందున్న కృష్ణ ఆడిటోరియంలో సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకూ మాన్యువల్ కౌన్సెలింగ్ చేపట్టనున్నట్లు తెలిపారు. అదే విధంగా 15వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతోపాటు, దరఖాస్తు చేయని అభ్యర్థులకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు అన్ని ధృవపత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

యూరియా అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు



తంగెడ సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

దాచేపల్లి: యూరియా అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జి.శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. ఇటీవల యూరియా కొరత అధికంగా ఉండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొంతమంది వ్యాపారులు ఏపీ నుంచి యూరియా బస్తాలను తెలంగాణకు అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డారు. దీంతో యూరియా ఇలా తరలిపోకుండా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సంయుక్తంగా బుధవారం రాత్రి పొందుగల, తంగెడ సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేపట్టారు. ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లే ప్రతి వాహనాన్ని ఆపి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. యూరియా తెలంగాణకు తరలించడం చట్టరీత్యా నేరమన్నారు. పూర్తిస్థాయిలో ఏపీలోనే రైతులు వినియోగించాలని కోరారు. అక్రమంగా తెలంగాణకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ పిడుగురాళ్ల ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఏవో వెంకటేష్, ఆర్ఐ శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.